నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 29 అక్టోబర్ 2024 | SANGAREDDY


నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే దాడి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, అక్టోబర్ 28:ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే కేటీఆర్ బంధువుల ఇంటిపై పోలీసులు దాడి చేశారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆరోపించారు.సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల్లో ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపిస్తున్నారనే అక్కసుతో కేటీఆర్ బంధువులు చేసుకుంటున్న దావత్‌పై దాడి చేశారని ఆరోపించారు. అక్రమంగా, అన్యాయంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కేటీఆర్ బంధువు గృహప్రవేశ దావత్‌పై దాడిచేయడం దారుణమని మండిపడ్డారు. ఇంట్లో దావత్‌లు చేసుకుంటే ఇప్పటికీ ఏ ప్రభుత్వం పర్మిషన్లు అడగలేదని గుర్తుచేశారు. డ్రగ్స్ కేసులో కేటీఆర్‌ను ఇన్వాల్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ దాడి చేశారన్నారు. రాజకీయంగా, ప్రజాస్వామ్యంగా ఇలాంటి దాడులు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కక్షసాధింపు చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేసి చూపెట్టాలన్నారు. ప్రతిపక్షం అనేది ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ అనుక్షణం ఒత్తిడి తీసుకురావడం ధర్మమన్నారు. ఆ ధర్మాన్ని నేడు కేటీఆర్, హరీశ్ రావు చేస్తుంటే వారిపైన అన్యాయంగా కేసులు పెట్టి ఏదోరకంగా జైలుకు పంపాలనే ఆలోచన సిగ్గుచేటన్నారు. దీపావళికి బాంబులు పేల్చుతామని ఓ మంత్రి అన్నాడని, ఆ బాంబు ఇదేనేమో అని ఎద్దేవా చేశారు. చివరికి ఆ బాంబు తుస్సుమందని హేళన చేశారు. ఎక్సైజ్ అధికారులు సైతం ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. అధికారంలో ఉండి మీరు ఇలా చేస్తే రేపు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే చేయా లా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటనర్సింగ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యం గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు షెక్‌హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ అదనపు కలెక్టర్ బదిలీ

నూతన అదనపు కలెక్టర్‌గా మెంచు నగేశ్

మెదక్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): మెదక్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటేశ్వర్లు వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మెంచు నగేశ్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...మెదక్ అదనపు కలెక్టర్‌గా గతేడాది జూలైలో బాధ్యతలు చేపట్టానని, 15 నెలలు జిల్లాలో పని చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేసినట్లు వివరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.15 నెలల్లో వానకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని చెప్పారు.

నిమ్జ్ భూబాధితులకు పరిహారం చెల్లింపు

జహీరాబాద్, అక్టోబర్ 28: నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన 18 మంది బాధిత రైతులకు రూ.3.20 కోట్ల పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ తహసీల్దార్ గడ్డం జనార్దన్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్జ్ భూబాధితులకు పరిహారం చెల్లింపు పత్రాలు అందజేశారు. బాధిత రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ఆన్‌లైన్‌లో చెల్లింపు చేశామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నిమ్జ్ ప్రాజెక్టు సిబ్బంది అనురాధ, పురుషోత్తం పాల్గొన్నారు.

పెద్దకోడూరులో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సందర్శిస్తున్న సిద్దిపేట జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి

చదువుతోనే సంపూర్ణ జ్ఞానం

చిన్నకోడూరు అక్టోబర్ 28:చదువుతోనే సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని, తద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని సిద్దిపేట జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల తరగతి గదులు, పరిసరాలు, కళాశాల సిబ్బంది అటెండెన్స్ రిజిస్ట్రర్,భోజనం నాణ్యత, వంటగది పరిసరాలు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. హాస్టల్‌లోని వాటర్ డ్రైనేజీ సిస్టం, వాటర్ లీకేజీ, బాత్ రూమ్స్, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని వెంటనే సరి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, అధ్యాపకులు పాల్గొన్నారు.


రాజీనామా పత్రాన్ని గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న ప్రసన్నహరికృష్ణ

నిరుద్యోగుల కోసం ఉద్యోగానికి రాజీనామా

- విద్యావంతులు, మేధావులకు వేదికగా శాసనమండలి ఉండాలి
- సిద్దిపేట జిల్లా గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన హరికృష్ణ

గజ్వేల్, అక్టోబర్ 28: విద్యావంతులు, మేధావులకు వేదికగా శాసనమండలిని మార్చాలనే ముందుకు సాగుతున్నానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఆయన రాజీనామా చేసిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 16 ఏండ్లుగా జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా వివిధ ప్రాంతాల్లో పని చేశానని, 271 మండలాల్లో తన వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నారన్నారు. నిరుద్యోగుల సమస్యలపై తనవంతు పోరాటం చేస్తానన్నారు. శాసనమండలిలో నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి, పట్టభద్రుల సమస్యలు తెలిసిన వారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. తెలంగాణలోని నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిలో రాణించేలా కృషి చేయాలన్నారు. 19 ఏండ్ల సర్వీస్ ఉండగా నిరుద్యోగుల కోసం ఉద్యోగానికి రాజీనామా చేశానన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో కొనుగోలు చేసి ట్రాక్టర్లలో ధాన్యం తరలిస్తున్న దళారులు

ధాన్యం రైతుల పరేషాన్

- కేంద్రాలు తెరిచారు..కొనుగోలు మరిచారు
- అమ్ముకునేందుకు రైతుల పడిగాపులు
- దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- కేంద్రాల్లోనే లారీలు పెట్టి మరీకొంటున్న దళారులు

చేర్యాల, అక్టోబర్ 28: తెలంగాణ సర్కారు రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతన్నలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. పదేండ్లలో రైతులు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు. వానకాలం పంట చేతికి రావడంతో 25 రోజుల క్రితమే సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని రైతులు వరి కోతలు ప్రారంభించారు. పంట పొలాల్లో కోత కోసి నేరుగా రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశానికి ధాన్యం తీసుకువచ్చి రాశులు పోస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేర్యాల మండలంలో 21, ఉమ్మడి మద్దూరు మండలంలో 20, కొమురవెల్లి మండలంలో 8 కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో కొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించినప్పటికీ కొనుగోలు ప్రారంభం కాలేదు. మరికొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించలేదు. సకాలంలో అధికారులు కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోలు చేస్తారని భావించినా రైతులకు చేదు అనుభవం ఎదురైంది. ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో పోసి రాశుల వద్ద రక్షణ కోసం కాపలా ఉంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పట్లో కేంద్రాలు ప్రారంభమయ్యే పరిస్థితి లేకపోవడం, కేంద్రాలు ప్రారంభించిన గ్రామాల్లో కాంటా కాకపోవడంతో రైతులు తక్కువ ధరకు దళారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2303(ఏగ్రేడ్), 2280 కామన్ రకానికి ఉండగా, రైతులు మిల్లుల్లో రూ.1800 నుంచి 1850 (క్వింటాల్) చొప్పున విక్రయించి నష్టపోతున్నారు. మిల్లుల్లో ధాన్యం విక్రయాలు జరిపిన రైతులకు వెంటనే డబ్బులు కావాలంటే 2శాతం కటింగ్‌తో కొందరు మిల్లర్లు డబ్బులు చెల్లిస్తున్నారు. రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాలు కురుస్తుండడంతో వరి పంటను విక్రయించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు అక్కడ ఎలాంటి వసతులు కల్పించడం లేదు. తాగునీటి వసతి, టార్పాలిన్లు, టెంట్లు, ధాన్యాన్ని తూర్పార పట్టేందుకు, జల్లి చేసేందుకు యంత్రాలు ఇప్పటి వరకు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయలేదు. మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కాంటా కావడం లేదు. దీంతో మధ్య దళారులు లారీ, ట్రాక్టర్లు తీసుకువచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల మేరకు దళారులు కేంద్రాల వద్దకు వచ్చి కొనుగోలు చేయవద్దు కానీ స్థానికంగా నెలకొన్న పరిస్థితుల వల్ల దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి రైతులను ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ ఉంచి కొనుగోలు చేస్తున్న దళారులు

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

నెల రోజులయ్యింది

పండించిన ధాన్యం కేంద్రంలో అమ్ముకుందామని తీసుకువచ్చి నెల రోజులు అవుతున్నది. రోజూ ధాన్యం కుప్పులను ఆరబోయడం తిరిగి రాశి చేసి ఇంటికి వెళ్లడం పరిపాటిగా మారింది. కేంద్రం తెరిచి కాంటా పెట్టకపోవడంతో తక్కువ ధరకు ఇవ్వాలని కొందరు దళారులు తిరుగుతున్నారు. ఇప్పటికే పది లారీల వరకు కొనుగోలు చేశారు. తక్కువ ధరకు ఇవ్వడం ఇష్టం లేక నేను విక్రయించలేదు. అధికారులు చర్యలు చేపట్టి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొంటేబాగుంటది.

– శనిగరం కనకయ్య, రైతు, ఆకునూరు, సిద్దిపేట జిల్లా

వసతులు కల్పించాలి

సోమవారం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కానీ, కాంటా ఎప్పుడు పెడతారో తెల్వదు. వచ్చిన ధాన్యం వచ్చినట్లు కొంటే రైతులకు మేలు చేసినట్లు అవుతుంది. కేంద్రాల వద్ద పరదాలు ఇవ్వాలి, కేంద్రం ఏర్పాటు చేసిన ప్రదేశంలో గడ్డి, చెత్త ఉండడం వల్ల రైతుకు ఇబ్బంది కలుగుతున్నది. వసతులు కల్పించి తొందరగా ధాన్యం కొనుగోలు చేస్తే బాగుంటుంది.

– ముత్యం నాగరాజు, రైతు, కొమురవెల్లి, సిద్దిపేట జిల్లా

పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రి దామోదర రాజనర్సింహ
- మెదక్ జిల్లా రేగోడ్ మండలం లింగంపల్లి రైతు వేదిక వద్ద సమావేశం
- హాజరైన జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

లింగంపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రేగోడ్, అక్టోబర్ 28: పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా రేగోడ్ మండలం లింగంపల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన సమావేశానికి ఆయతోపాటు జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ బోరంచ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అజ్జమర్రి వంతెనకు రూ.70 కోట్లు, నర్సింగ్ కాలేజీకి రూ.40 కోట్లు మంజూరు చేశామన్నారు. రహదారులపై జరిగే ప్రమాదాల దృష్ట్యా ప్రతి 20 నుంచి 30 కిలోమీటర్ల మధ్యలో ఒక ట్రామా సెంటర్ ఉండేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. కంకోల్, జోగిపేట, నిజాంపేటలో ట్రామాసెంటర్లు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వం వైద్యం, విద్యకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వట్‌పల్లిలో 30పడకల దవాఖానకు రూ.12 కోట్లు మంజూరు చేశామన్నారు. కులగణన చేసిన తర్వాతే సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. జ్యాబ్ క్యాలెండర్ ప్రకటించిన వెంటనే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో సీతారావమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు దిగంబర్‌రావు, శేషారెడ్డి, పీసీసీ నేత కిషన్, మాజీ జడ్పీటీసీలు యాదగిరి, రాజేందర్ పటేల్, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యామ్‌రావు, రాధాకిషన్, శ్రీధర్‌గుప్తా, ఫాజిల్, శంకరప్ప, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య

అల్లాదుర్గం,అక్టోబర్ 28: విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని వైద్యారోగ్యశాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చిల్వెర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి ఎన్‌సీసీ విద్యార్థులు స్వాగతం పలికారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎం మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు సంగమేశ్వర్, బలరామ్, బాలకిషన్, అంజాగౌడ్, నర్సింహారెడ్డి, మహేశ్, సదానందం పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

మనూరు, అక్టోబర్ 28: పైప్‌లైన్ పనుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా నాణ్యతతో చేపట్టాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్‌శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని బోరంచ నల్ల పోచమ్మ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనూరు మండలం బోరంచ, రేగోడ్ మండలం సిందోల్ తాటిపల్లి, లింగంపల్లితో పాటు పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోఎత్తిపోతల పథకానికి రూ.7కోట్ల 40లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. అంతకు ముందు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేకు ఆలయం వద్ద స్వాగతం పలికారు. బోరచ నల్లపోచమ్మ, సాంభశివుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ జలేందర్, ఏఈ విద్య, ఆర్డీవో అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ వెంకటస్వామి, నాయకులు డిగంబర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజు పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28: బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు హాజరై మాట్లాడారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో సర్వే నెంబర్ 120, 121, 125లో రైతుల నుంచి ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలన్నారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకు 300 గజాల ఇండ్ల స్థలం ఇవ్వాలన్నారు. హెచ్ఎండీఏ అధికారులు రైతులకు పరిహారం చెల్లించకుండా భూసేకరణ చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. గ్రామంలో సభ నిర్వహించకుండా, నోటీసులు ఇవ్వకుండా భూములను తీసుకోవడం అన్యాయమని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యకాస కార్యదర్శి నర్సింహులు, మాజీ ఎంపీటీసీలు జంగయ్య, ముత్యాలు, నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

గిన్నీస్‌బుక్ రికార్డు లక్ష్యం

పటాన్‌చెరు, అక్టోబర్ 28: గీతం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రిశ్రీవాస్తవ గిన్నీస్‌బుక్ రికార్డుకు గురిపెట్టింది. సోమవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ, ఆమె తల్లి కవితా జోహ్రి శ్రీవాస్తవ మరో ఐదు గిన్నీస్‌బుక్ రికార్డులు కొట్టాలని ప్రపంచంలోనే అతిపెద్ద ఒరిగామి(కాగితపు బొమ్మలు) ప్రదర్శనను హాల్‌లో ప్రారంభించారు. ఒరిగామితో రూపొందించిన 4,700 కుందేళ్లు, 4,500 తాబేళ్లు, 4,009 నెక్‌బో, 7,200 కార్టు, 3,730 స్టిల్‌ఫిస్‌లను ప్రదర్శించారు. ప్రదర్శనలో పెట్టిన కళాకృతులను న్యాయ నిర్ణేతలు చూసి లెక్కించారు. రికార్డుల సీడీలను పరిశీలించి గిన్నీస్‌బుక్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపించనున్నారు.

కళను ప్రదర్శించిన గీతం పూర్వ విద్యార్థిని

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 28: ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశిశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ప్రజావాణిలో మొత్తం 66 అర్జీలు వచ్చాయన్నారు. ఆయా అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 28: అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి సమస్యలు విన్నవించుకోవటానికి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 19 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో నాగరాజమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): గ్రీవెన్స్‌లో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా సూచించారు. ధరణి సమస్యలపై 30, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం 14, పింఛన్ల కోసం 2, ఎంప్లాయిమెంట్ కోసం ఒకటి, పంట రుణమాఫీకి సంబంధించి మూడు, ఇతర సమస్యలపై 36 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరగా పరిష్కరించాలి

మెదక్ అర్బన్,అక్టోబర్ 28:అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు.